క్లుప్తంగా

ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక



శిల్పను అభినందిస్తున్న జెడ్పీటీసీ కోటి సుధ, ఎంఈఓ సుధాకర్‌నాయక్ తదితరులు

బత్తలపల్లి: ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శిల్ప ఎంపికైనట్లు ఫుట్‌బాల్ కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 3, 4వ తేదీలలో అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో శిల్ప పాల్గొంటుందన్నారు. కాగా విద్యార్థిని శిల్పను జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఎంఈఓ సుధాకర్‌నాయక్‌లు అభినందనలు తెలిపారు.

సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రెక్కమాను అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రెక్కమాను అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే



భాస్కరరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: మండల పరిధిలోని వద్దిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఏ.భాస్కరరెడ్డి సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి వద్దిరెడ్డిపల్లికి వెళ్లి భాస్కరరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మాజీ సర్పంచ్ కాకర్ల రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

31న మున్సిపల్ సమావేశం

ధర్మవరం అర్బన్: ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 31న కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మంగళవారం తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

ఓపెన్ స్కూల్‌లో చేర్పించండి

కొత్తచెరువు: టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన డ్రాపౌట్ విద్యార్థులకు ఏపీ ఓపెన్ పాఠశాలలో ప్రవేశాలు కల్పించాలని ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ జయచంద్ర సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, వలంటీర్లతో జీఈఆర్ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

వ్యక్తికి గాయాలు

కొత్తచెరువు: మైలేపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీకేపల్లి మండలం ఒంటి కొండకు చెందిన నాగార్జున అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈయన బైక్‌లో కొత్తచెరువు వైపు నుంచి వెళ్తుండగా మైలేపల్లి వద్దకు రాగానే ధర్మవరం వైపు నుంచి వస్తున్న 407 ఎదురైంది. రెండు వాహనాలు ఢీకొనడంతో నాగార్జునకు కాలు విరిగింది. అతన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ టోర్నీలో విజేత బీసీ వారియర్స్ జట్టు



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బత్తల వెంకటరమణ

నల్లచెరువు: తాటిచర్ల బ్రదర్స్ మైదానంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ మండల స్థాయి ఫైనల్ మ్యాచ్‌లో బీసీ వారియర్స్ జట్టు 3 పరుగుల తేడాతో కప్పల్ జట్టుపై విజయం సాధించింది. వైఎస్సార్ సీపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ,బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు పాల్గొని టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు. తొలుత బరిలోకి దిగిన బీసీ వారియర్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 117 పరుగులు చేయగా 118 పరుగుల లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన కప్పల్ టీమ్...114 పరుగులు చేసి 3పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విజేతగా నిలిచిన బీసీ వారియర్స్ జట్టు కదిరిలో జరగబోయే నియోజకవర్గ స్థాయి ఫైనల్ మ్యాచ్‌కు అర్హత సాధించింది.

దేశభాషలందు తెలుగు లెస్స

పుట్టపర్తి: మాతృభాష తెలుగు దేశభాషల్లోనే మహోన్నతమైనదని వక్తలు పేర్కొన్నారు. తెలుగు వ్యవహారిక భాషోద్యమ మూలపురుషుడు, సంఘ సంస్కర్త గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భాషా నిపుణులు, సాహితీవేత్తలు పాల్గొని తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. బుక్కపట్నం సత్యసాయి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జగదీశ్వర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు సమ్మెట మాధవరాజు హాజరై మాట్లాడారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం ఇసాక్ గిడుగు రామమూర్తిపై చక్కటి పాటను పాడి వినిపించారు. మాధవరాజును ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలపై పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బుక్కపట్నం ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనం నిర్వహించారు. పీడీ నాగరాజు,ఉపాధ్యాయులు జనార్దన్,మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి డిపో మేనేజర్ ఇనయతుల్లా పూలమాల వేసి నివాళులర్పించారు. గిడుగు రామమూర్తి ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడన్నారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడన్నారు.

పుట్టపర్తి అర్బన్: పండితులకు పరిమితమైన తెలుగు భాషను పామరులకు సైతం చేరువ చేసిన ఘనత గిడుగు రామమూర్తికి దక్కుతుందని పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గిడుగు రామమూర్తి రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పీడీ సూర్యనారాయణ, సోమశేఖరరాజు, శేఖర్‌రెడ్డి, మోహన బాలాజీ, వెంకటేశులు, రమామణి, చెన్నకృష్ణారెడ్డి, రమాదేవి, నిర్మల పాల్గొన్నారు.



పెడబల్లి ఉన్నత పాఠశాలలో గిడుగు వేంకట రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా, సిబ్బంది

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బత్తలపల్లి: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీజ్యోతి హైస్కూల్‌లో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. శ్రీజ్యోతి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు తెలిపిన మేరకు తీయనైన తెలుగు భాషను ఆదరించాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శాంతకుమారి, రాజేంద్రప్రసాద్ పాల్గొని గిడుగు వేంకట రామమూర్తి పంతులు తెలుగు భాష అభివృద్ధికి చేసిన కృషి గురించి వివరించారు.

నల్లమాడ: నల్లమాడ, రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో మంగళవారం తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎంలు భాస్కర్‌రెడ్డి, జంషీద్‌బాషా పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలలోని తెలుగు భాషా పండితులు సూర్యనారాయణ, కళావతిని విద్యార్థులు సన్మానించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన 10 మంది విద్యార్థులకు మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అబ్బాస్, పీడీ రమేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కనగానపల్లిలోని మోడల్ స్కూల్, కేజీబీవీలతో పాటు మామిళ్లపల్లి, తగరకుంట, మద్దెలచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగుభాష, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు.

రామగిరి: మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నసనకోటలోని బీసీ బాలికల పాఠశాల, పేరూరుడ్యాం బీసీ బాలుర పాఠశాలల్లో ప్రత్యేకంగా తెలుగుభాషా దినోత్సవం జరిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగును ప్రేమిద్దాం.. పరభాషను గౌరవిద్దాం అనే నినాదంతో విద్యార్థులతో ర్యాలీ చేయించారు.



ధర్మవరంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ర్యాలీ చేస్తున్న నసనకోట బీసీ (బాలికల) పాఠశాల విద్యార్థినులు



కనగానపల్లిలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

సచివాలయాల్లోనే జాబ్ కార్డులు అందించాలి

బత్తలపల్లి: ఉపాధిహామీ పథకంలో కూలీలకు జాబ్‌కార్డును గ్రామ సచివాలయాల్లోనే అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను మండల ప్రజా ప్రతినిధులు కోరారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ అధికారి రమణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు పాల్గొన్నారు. 2022-23వ ఆర్థిక సంవత్సరంలో రూ.6.43కోట్లతో 1,051 పనులు చేపట్టగా రూ.58,741 నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. ఈ మొత్తాన్ని రికవరీ చేస్తామన్నారు. ఎంపీడీఓ సౌజన్యకుమారి, అంబుడ్స్‌మెన్ మధుసూదన్, ఏపీడీలు వెంకటాచలపతి, శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఆర్‌పీ నాగార్జున, ఏవీఓ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, మండల ఇంజనీర్ రమణయ్య, ఏపీఓ ఆదెప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచులు అక్కిం దామోదర్, చల్లా కరుణాకరనాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఎన్‌పీకుంట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ రాధిక అన్నారు. బాల్యవివాహాలతో జరిగే అనర్థాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఎన్.పీ.కుంట-2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సర్పంచ్ ఆంజినమ్మ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ ఆడపిల్లలకు 21 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. బాల్యంలోనే వివాహాలు చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ, మహిళా పోలీస్ లలితకళ, రెడ్స్ సంస్థ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, కమ్యూనిటీ సోషల్ వర్కర్ రవీంద్ర, అంగన్‌వాడీ కార్యకర్త భారతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: టీడీపీ హయాంలో అభివృద్ధి కాగితాలకే పరిమితం కాగా సీఎం జగనన్న పాలనలో అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వరిగిరెడ్డిల్లో జెడ్పీ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మతో కలిసి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జెడ్పీ నిధులు కేటాయించి కదిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ సహకరిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నియోజకవర్గంలో దాదాపు 135 పల్లెలకు అప్రోచ్‌రోడ్లు వేశామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 14 ఏళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయి, సర్పంచ్ శుభలేఖ విశ్వనాథ్, వైస్ ఎంపీపీ అనంద్‌నాయక్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్, గొల్లపల్లికి చెందిన 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఓడీచెరువులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలు వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. కురాకుల చలపతి, కురాకుల వినయ్, ఆవుల రామచంద్ర, ఆవుల నారప్ప, ఆవుల ఆంజినేయులు, ఆవుల వెంకటేష్‌కు ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా ఓడిచెరువు మండలం కొండకమర్లకు చెందిన హైదర్‌వలి కుటుంబం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిభక్తుల్లా, బాషా, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నేడు గడప గడపకూ

అమడగూరు: ఓడిచెరువు గ్రామ సచివాలయం -1 పరిధిలోని ఓడిచెరువు టౌన్‌లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు చేపట్టే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



పుట్టపర్తి: ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ రవినాయక్



కోచ్‌తో హాకీ క్రీడాకారులు

పుట్టపర్తి: ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుక్కపట్నంలో శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవినాయక్ పాల్గొన్నారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడపై ఆసక్తి పెంచుకొని సాధన చేసి రాణించాలన్నారు.

ధర్మవరం: నాగలూరు వద్దనున్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అథ్లెటిక్స్, కబడ్డీ, హైజంప్, లాంగ్‌జంప్, జావలిన్‌త్రో, వాలీబాల్, ఫుట్‌బాల తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, జగదీష్, నాగమోహన్ రెడ్డి,నరేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: కాకతీయ విద్యానికేతన్‌లో గిడుగు రామమ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి మెడల్స్ అందించారు. వ్యవస్థాపకుడు రామిరెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాష్, పద్మ పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో, కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి జిల్లా హాకీ కోచ్ హసేన్ స్థానిక క్రీడా మైదానంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు.

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని బ్లూ మూన్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శివశంకర్, డీఎస్పీ శ్రీలత, పట్టణ సీఐ మధు హాజరయ్యారు. ఎస్టీఎస్ఎన్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. స్మిత పాల్గొని మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కదిరి పట్టణంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3కే రన్‌కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఓడిచెరువు గ్రామ సచివాలయం -1 పరిధిలోని ఓడిచెరువు టౌన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ కుళాయిలు, సీసీ రోడ్లు వేయించాలని పలువురు కోరారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్తగా ఇళ్లు కావాలనుకునే వారు హౌసింగ్ అధికారులను, గ్రామ వలంటీర్లను సంప్రదించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, ఎంపీపీ పర్వీన్‌భాను, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, మండల అగ్రీబోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, సర్పంచ్ గోవిందు, ఎంపీటీసీ రజిత, సింగిల్‌విండో అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జగన్ మోహన్‌చౌదరి, వెంకటరంగారెడ్డి, వెంకటరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జౌలీ బాబా, నర్సిరెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. కదిరి నుంచి కాళసముద్రం వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెళ్తుండగా వెనుకనే వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన రాఘవ, శ్రీనివాసులు, నల్లమాడ మండలం బడవాండ్లపల్లి వెంకటరమణలకు గాయాలయ్యాయి. వీరిని కదిరి ఆస్పత్రికి తరలించారు.

నూర్పిడి యంత్రం బోల్తా

- ముగ్గురు కూలీలకు గాయాలు

ముదిగుబ్బ: నూర్పిడి యంత్రం బోల్తా పడి ముగ్గురు కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన నాగారెడ్డిపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. వేరుశనగ నూర్పిడి అనంతరం యంత్రాన్ని ట్రాక్టర్‌కు తగిలించుకొని పట్నం గ్రామానికి తీసుకెళ్తుండగా నాగారెడ్డిపల్లి గ్రామం దాటగానే బోల్తా పడింది. ఈ ఘటనలో కదిరి మండలం నడిమిపల్లి గ్రామానికి చెందిన లలితమ్మ, పట్నం గ్రామానికి చెందిన రేష్మ, ఈశ్వరమ్మలు గాయపడగా కదిరి రభుత్వ ఆసుపత్రి తరలించారు. రేష్మ, ఈశ్వరమ్మల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుసుకున్న డాక్టర్లు అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పట్నం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు ఇవ్వండి

- ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు మార్పులు చేయాల్సి ఉంటే ప్రతిపాదనలు ఇస్తే పరిశీలిస్తామని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు లేకున్నా, 1500 మంది ఓటర్ల కంటే అధికంగా ఉన్నా ,పోలింగ్ కేంద్రాల మార్పు చేయాల్సి ఉన్నా ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. తొలగించిన ఓటర్లను బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలు పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. 18 ఏళ్ల పూర్తయిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలు రూపొందించే నాటికి సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ జిలాని, తహసీల్దార్‌లు నవీన్‌కుమార్, హరిక్రిష్ణ, తరుణ్‌కుమార్, రహిమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

కనగానపల్లి మోడల్ స్కూల్‌కు ‘ఉత్తమ’ అవార్డు

కనగానపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జిల్లా స్థాయిలో ఉత్తమ క్రీడా పాఠశాలగా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. మంగళవారంజాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా పాఠశాల పీడీ మాధవరాజులు ఉత్తమ క్రీడా పురస్కారం అందుకున్నారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో పలువురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి, బహుమతులు అందుకున్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

కనగానపల్లి: ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని శ్రీసత్యసాయి జిల్లాలోని అన్నింటిని కరువు మండలాలుగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మహదేవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల రైతు సంఘం నాయకులతో కలసి ఆయన మంగళవారం పలు గ్రామాల్లోని వేరుశనగ, కంది, ఆముదం పంటలను పరిశీలించారు.

భర్త, అత్తామామలు దాడి చేశారని ఫిర్యాదు

రామగిరి: భర్త సాకే మురళితోపాటు అత్తామామలు బాబయ్య, ముత్యాలమ్మ దాడి చేశారని జయలక్ష్మి అనే వివాహిత పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. దాడిలో తీవ్రంగా గాయపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. వివరాలు..రామగిరికి చెందిన బాబయ్య, ముత్యాలమ్మల కుమారుడు సాకే మురళికి అదే గ్రామానికిచెందిన ముత్యాలప్ప, ముత్యాలమ్మ కుమార్తె జయలక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఇటీవల జరిగిన గొడవలో జయలక్ష్మిపై భర్త, అత్తామామలు దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితురాలు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది.

క్రీడా విజేతలకు బహుమతుల అందజేత

అమడగూరు: పామిడిలో ఈ నెల 20వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్, ఖోఖో పోటీల్లో ఓడిచెరువులోని వశిష్ట పాఠశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ గోపి విజేతలకు అవార్డులు, మెడల్స్, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో కూడా రాణించాలన్నారు.